క్లుప్తంగా

రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు



నకరికల్లు: రైతులకు అందుబాటులో ఉండే విధంగా రైతు సేవా కేంద్రాల్లో ఎరువులను సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఎరువులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ గుండ్లపల్లి, నర్సింగపాడు, దేచవరం, చల్లగుండ్ల, కండ్లకుంట, చేజర్ల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో డీఏపీ, యూరియా, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. కావలసిన రైతులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కె.హనుమంతరావు, రైతులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా శివసుబ్రమణ్యం



అచ్చంపేట: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా శివసుబ్రమణ్యం బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధులలో భాగంగా ఇక్కడ పనిచేస్తూ నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లిన శివసుబ్రమణ్యం తిరిగి ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన కుసుమకుమారి ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు.

వైభవంగా కోదండరామ స్వామి ఆలయ వార్షికోత్సవం



కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలో వేంచేసియున్న కోదండరామస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు. 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తొండపిలో బేటీ బచావో.. బేటీ పఢావో



తొండపి(ముప్పాళ్ళ): ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సత్తెనపల్లి, ఇరుకుపాలెం సెక్టార్ పరిధిలోని తొండపి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మీ పాల్గొని భ్రూణహత్యలు, బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించటానికి అందరూ చదువుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.ఆదిలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.నాగలక్ష్మీ, పి.షకీలాబేగం, బీ.శ్రీభవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవం పరస్కరించుకుని స్థానిక శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్‌లో బుధవారం మండలంలోని మండల పరిషత్, ఎయిడెడ్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను మండల విద్యాశాఖాధికారి శివబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జెండా వందన కార్యక్రమంలో బహుమతి ప్రదానం చేస్తామని ఎంఈవో-2 శివబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంటి సాంబశివరావు, ఎం. వేంకటేశ్వరరావు, ఐజాక్, సుబ్బారావు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎంపీడీవో మహేష్



క్రోసూరు: క్రోసూరు ఎంపీడీవో టీవీ రమణ స్థానంలో ఎన్నికలకు ముందు పనిచేసిన ఎంపీడీవో మహేష్‌బాబు బుధవారంవిధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు పనిచేసిన ఎంపీడీవో టీవీ రమణను మండల పరిషత్ కార్యాలయ అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఎంపీడీవో టీవీ రమణ మట్లాడుతూ క్రోసూరు మండలంలో ప్రజలు, రాజకీయ పార్టీ నాయకులు అందరూ తనకు బాగా సహకరించారని, మండల అధికారులు, కార్యదర్శులతో పనిచేయటం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. అనంతరం కొత్తగా వచ్చిన ఎంపీడీవో మహేష్‌బాబు తన అనుభవాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీపీ పి.కోటయ్య పాల్గొన్నారు.

వరలక్ష్మీ వ్రతానికి వేళాయె..!

అలంకరణ అంటే మహిళలకు ఎంత ఇష్టమో చెప్పనక్కర్లేదు. అందులోనూ సృజనాత్మకతను జోడిస్తూ.. మనసారా వేడుకుంటూ చేసే వరలక్ష్మీ వ్రతాల్లో అలంకరణే ప్రత్యేక ఆకర్షణ. సిరుల తల్లి కట్టుబొట్టు నుంచి నైవేద్యం వరకు ప్రతిదీ కొత్తగా ఉండాలనుకుంటారు. అమ్మవారితో పాటు దీపాలు, కలశాలు, ముత్తయిదువులకు ఇచ్చే తాంబూలాలు ప్రత్యేకంగా ఉంటాయి. వీటిని కొనేందుకు మహిళలు చొరవ చూపడంతో మార్కెట్ కళకళలాడుతోంది.



విక్రయానికి సిద్ధంగా ఉన్న బంగారు లక్ష్మీకాసులు

- మహిళలతో కళకళలాడుతున్న దుకాణాలు
- రేపు వరలక్ష్మీ వ్రతం



సత్తెనపల్లి: సౌభాగ్యం, సంపదలు, కుటుంబ శ్రేయస్సు కోసం మహిళలు ఈ మాసంలో ఆచరించే వాటిలో వరలక్ష్మీ వ్రతం ప్రధానమైంది. శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున ఈ వ్రతాన్ని చేసుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఈ నెల 16న శుక్రవారం ఈ వ్రతం నిర్వహించనున్నారు. ఇళ్లలో పవిత్ర కలశాన్ని ప్రతిష్టించి అమ్మవారి మూర్తిని దానిపై ఉంచి పూజలు చేస్తారు. ఇప్పటి నుంచే వ్రతానికి అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు మహిళలు చొరవ చూపుతున్నారు. దీంతో గత వారం రోజులుగా మార్కెట్లు కళకళలాడుతున్నాయి. వస్త్ర దుకాణాలు, బంగారు ఆభరణాల దుకాణాలు, చిల్లర సరుకులు వంటి అనేక వ్యాపార సముదాయాలు కొనుగోలుదారులతో నిండిపోయి కనిపిస్తున్నాయి. పెద్ద, చిన్న వస్త్ర వ్యాపారులు శ్రావణమాసం సందర్భంగా ఆఫర్లు ప్రకటించడంతో మహిళలు కొనుగోలు చేయడానికి రావడంతో కళకళలాడుతున్నాయి.

బంగారం కొనుగోలుకు ఆసక్తి

కలశం వద్ద కొత్తగా కొన్న బంగారు వస్తువులను ఉంచడం సంప్రదాయంగా వస్తోంది. పండగ నాటికి బంగారం ఖరీదు పెరుగుతుందనే భావనతో మహిళలు ముందే కొద్దో గొప్పో బంగారం కొనుగోలు చేస్తారు. ఈ పండగ కోసమని బంగారు వ్యాపారులు ప్రత్యేకంగా తక్కువ ధర గల చిన్న వస్తువులను అందుబాటులో ఉంచుతున్నారు. ముఖ్యంగా లక్ష్మీ దేవి రూపంలో బంగారు కాసులు, చిన్న డాలర్లు, అమ్మవారి రూపాలను ఒకటి నుంచి రెండు, మూడు గ్రాముల బరువు గల వస్తువులను విక్రయానికి సిద్ధం చేశారు. వాటితో పాటు వెండితో చేసిన అమ్మవారి ముఖ రూపాలను అందుబాటులో ఉంచారు. కాసులు, బరువును బట్టి రూ.2 వేల నుంచి రూ.7 వేల వరకు విక్రయిస్తున్నారు. బంగారు కాసులు, ముక్కుపుడకలు, చిన్న డాలర్లు, చిన్న కమ్మలకు గిరాకీ ఉందని బంగారు దుకాణాల యజమానులు తెలిపారు. ప్రత్యేకించి వరలక్ష్మీ వ్రతం కోసం మహిళలు చిన్న వస్తువైనా కొంటారని.. దీనికి తోడు గత రెండు, మూడు సంవత్సరాలతో పోలిస్తే ఈ శ్రావణ మాసంలో వివాహ ముహూర్తాలు ఎక్కువగా ఉండడంతో వ్యాపారం జోరందుకుందని వ్యాపారులు చెబుతున్నారు.

పంచాయతీల అభివృద్ధికి బాధ్యత వహించాలి

గుంటూరు జిల్లా పరిషత్ సీఈవో వసంత రాయుడు



మాట్లాడుతున్న గుంటూరు జిల్లా పరిషత్ సీఈవో వసంత రాయుడు

సత్తెనపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు, గ్రామ స్థాయి అధికారులదే కీలక బాధ్యత అని గుంటూరు జిల్లా పరిషత్ సీఈవో ఎస్ఎస్‌వీబీ వసంత రాయుడు అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గత రెండు రోజులుగా మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణలో భాగంగా బుధవారం మూడో రోజు ముగింపు శిక్షణకు ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా పరిషత్ సీఈవో వసంత రాయుడు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి పాటు పడాల్సిన ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు ఇలాంటి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి పంచాయతీలోనూ తడి, పొడి చెత్త సేకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సేంద్రియ ఎరువులను తయారు చేసుకుని ఆదాయ మార్గాలను పెంచుకోవాలన్నారు. మూడో రోజు శిక్షణలో భాగంగా వీధి దీపాల ఏర్పాటు, పంచాయతీరాజ్ చట్టం, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, మూడు రోజులు పాటు చెప్పిన అంశాలపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, డీఎల్‌డీవో రాజగోపాల్, ఏవో బసవకుమారి, ఈవోపీఆర్డీ దయాసాగర్, టీవోటీలు గోలి శ్రీనివాసరావు, అంకమ్మరావు డీపీ సాగర్, మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలి

ముప్పాళ్ళ: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీలో ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని జెడ్పీ సీఈవో వసంతరాయుడు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ అభివృద్ధి ప్రణాళికల తయారీపై గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు జరుగుతున్న ముగింపు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి సమగ్ర అంశాలపై ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఆయా అంశాలపై ప్రజా ప్రతినిధుల సలహాలు తీసుకోవాలన్నారు. ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుట్టారెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఏడుకొండలు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు



రైతులకు సూచనలిస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా ఎన్ఎఫ్ఏ సైదయ్య, సిబ్బంది

నకరికల్లు: ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి భారం తగ్గడంతో పాటు ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు సాధించవచ్చని జిల్లా ఎన్ఎఫ్ఏ సైదయ్య అన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో నకరికల్లులో రవికుమార్ అనే రైతు సాగు చేస్తున్న వరిపంట క్షేత్రాన్ని బుధవారం సందర్శించి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో భూసారం పెరగడంతో పాటు పంటలకు చీడపీడలు ఆశించవన్నారు. పురుగుల దాడి, తెగుళ్లను తట్టుకునే శక్తి పంటలకు లభిస్తుందన్నారు. వరి నాట్లు వేసే ముందు నారును బీజామృతంతో శుద్ధి చేస్తే అగ్గి, పొడ తెగులు ఆశించకుండా అరికట్టవచ్చన్నారు. నారుకొనలు తుంచి నాటడం ద్వారా కాండం తొలుచు పురుగును నివారించవచ్చన్నారు. వరి సాగులో ఉపయోగించే కషాయాలు, ద్రావణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ బాజీబాబు, ఏఎంఎంటీ చలపతి, హసీనా, మోడల్ ఫార్మర్ రామసుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణప్రసాద్

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో సుపరిపాలన అందించేందుకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీడీవో రామకృష్ణప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల అభివృద్ధిపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని రహదారులలో వీధిలైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని, సైడు కాలువల్లోని పూడికలు తీసి పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో నిలపాలని సర్పంచ్‌లు, కార్యదర్శులకు సూచించారు. అలాగే ప్రతి గ్రామ పంచాయతీలో జెండా వందన కార్యక్రమం చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ పగడాల ముక్కంటి, ఏఈ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బోరు నీళ్లు తాగడంతో 10 మందికి అతిసార



బోరును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

హసనాబాద్ (క్రోసూరు): మండలంలోని హసనాబాద్ గ్రామంలో బోరు నీళ్ల తాగటంతో 10 మంది అతిసారకు గురయ్యారు. వీరందరినీ సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు దొడ్లేరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సాద్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని జెడ్పీ పాఠశాల వద్ద పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి సందర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సాద్ మాట్లాడుతూ గురువారం నుంచి ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని నలుగురికి మోషన్ పరీక్షల శాంపిల్స్, అదేవిధంగా బోరు నీటి శాంపిల్స్ తీసుకుని పరీక్షలకు పంపించినట్లు తెలిపారు. వైద్యశిబిరం రాత్రి కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పీ పాల్గొన్నారు.



పట్టణంలోని విద్యుత్‌దీపాలతో మెరుస్తున్న మున్సిపల్ కార్యాలయం



పట్టణంలో విద్యుత్‌దీపాలంకరణలో గడియార స్తంభం

సత్తెనపల్లిలో విద్యుత్ ధగధగలు

సత్తెనపల్లి: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్.. హర్ ఘర్ తిరంగాలో భాగంగా దేశభక్తి ఉప్పొంగేలా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, గడియార స్తంభం విద్యుత్ దీపాలతో ధగధగలాడుతున్నాయి. గురువారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వాగతం పలికేలా బుధవారం విద్యుత్ దీపాలంకరణ చేపట్టడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మనస్థాపంతో యువకుడి ఆత్మహత్యాయత్నం

సత్తెనపల్లి: యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన సత్తెనపల్లి మండలం భృగుబండ గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన కొల్లి రోహిత్‌రెడ్డి అలియాస్ లక్ష్మారెడ్డి(22) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం వెళ్లదీస్తున్నాడు. లక్ష్మారెడ్డి సోదరుడు కొల్లి రామకృష్ణారెడ్డి చదువుకొని ఉద్యోగం చేస్తున్నాడు. ఇద్దరూ కవల పిల్లలు అయినప్పటికీ సోదరుడు ఉద్యోగం చేస్తుండటం, లక్ష్మారెడ్డి ఏడో తరగతి వరకే చదువుకుని వ్యవసాయ పనులకు పరిమితమయ్యాడు. గ్రామంలో ఎంతో మంది యువకులు ఉద్యోగాలు చేస్తుండగా తాను చదువుకోలేకపోయానని మనస్థాపం చెంది గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. మంగళవారం రాత్రి ఇంటికి వెళ్లి వాంతులు చేసుకోవడంతో గుర్తించిన తల్లి, తాతయ్య వెంటనే గ్రామంలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. ప్రస్తుతం లక్ష్మారెడ్డి ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ గడ్డి మందు ప్రభావం ఎక్కువగా ఉండటంతో అబ్జర్వేషన్‌లో ఉంచారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు బుధవారం వివరాలు సేకరించారు.

జాతీయ జెండాలు పంపిణీ



సత్తెనపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నవ చైతన్య వివేకా సేవా సమితి అధ్యక్షుడు నోముల వెంకటచలపతిరావు ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు, రాజకీయ నాయకులకు, ప్రభుత్వ ఉద్యోగులకు జాతీయ జెండాలను బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. ముందుగా పట్టణంలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద సమితి సభ్యులు జాతీయ జెండాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వెంకటచలపతిరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను కట్టాలన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు జవ్వాజి రామమోహనరావు, దూపగుంట్ల జానకిరామారావు, కె.వి.సాంబశివరావు, కె.బదరినారాయణ, ఎ.సత్యనారాయణ, ఎం.రాంబాబు, గడ్డం శివశంకరరావు, షేక్ బుడే, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం ఎస్ఐగా వేణుగోపాల్



రాజుపాలెం: రాజుపాలెం ఎస్ఐగా కె.వేణుగోపాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న కె.వేణుగోపాల్‌ను రాజుపాలెం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టి శాంతిభద్రతలకు చర్యలు తీసుకుంటానని అన్నారు.

తూకాల్లో తేడాలు ఉంటే చట్ట ప్రకారం చర్యలు

సత్తెనపల్లి: తూకాల్లో తేడాలు ఉంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతల శాఖ జిల్లా జాయింట్ కంట్రోలర్ మాధురి అన్నారు. పట్టణంలోని గుంటూరు రోడ్డులోని రెండు రైస్ మిల్లుల్లో తూనికలు కొలతల శాఖ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. బియ్యం బస్తాల కాటాలో తేడాలను గుర్తించారు. 25 కిలోల బియ్యం బస్తాకు గాను ఒకటి, రెండు కిలోలు తక్కువ ఉన్నట్లు, 26 కిలోల బియ్యం బస్తాలలో కూడా తక్కువ ఉన్నట్లు ఈ తనిఖీల్లో గుర్తించి కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ అల్లూరయ్య, సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ సైదా తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సత్తెనపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన గుంటూరు జీజీహెచ్‌లో మంగళవారం జరిగింది. పట్టణ పోలీసులు బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వడ్డవల్లి శాస్త్రినగర్‌కు చెందిన తోట ప్రేమ్‌కుమార్ (24) ఈ నెల 8న జ్వరం రావడంతో బాధను భరించలేక విచక్షణ కోల్పోయి శీతలపానీయంలో ఎలుకల మందు కలుపుకొని తాగాడు. వెంటనే పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి 4 నెలల క్రితం వివాహమైంది. ప్రేమ్ కుమార్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దీపాలదిన్నెపాలెం సర్పంచ్ రాజీనామా..!?

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం దీపాలదిన్నెపాలెం గ్రామ సర్పంచ్ వాసిరెడ్డి ఇందిర బుధవారం తన పదవికి రాజీనామా చేసింది. ఈ మేరకు ఆమె భర్త నరేంద్ర రాజీనామా పత్రాన్ని ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌కు అందజేశాడు. టీడీపీ సానుభూతి పరురాలైన సర్పంచ్ వాసిరెడ్డి ఇందిర గ్రామంలో చౌక దుకాణం తాను సిఫార్స్ చేసిన వారికి కాకుండా మరొకరికి కేటాయించిన నేపథ్యంలో మనస్థాపం చెంది రాజీనామా చేసినట్లు సమాచారం. కాగా రాజీనామా పత్రాన్ని ఎంపీడీవోకు అందజేయలేదు. ఈ వ్యవహారం మండలంలో చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీలో కుదుపు లేపుతోంది.

ఏసు మార్గంలో నడవాలి

మాచర్ల : పట్టణంలోని 22వ వార్డులో బేతేల్ మందిరం పాస్టర్ జాన్‌వెస్లి ఆధ్వర్యంలో 40 రోజుల ఉపవాస ప్రార్థనలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం పాస్టర్ జాన్‌వెస్లి మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడిచి ముందుకు వెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరితో ప్రేమ, దయాగుణాలు కలిగి ఉండాలన్నారు.

ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసించాలి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు మెమెంటో అందిస్తున్న వీరవల్లి శ్రీనివాసరావు తదితరులు

సత్తెనపల్లి: ప్రతి విద్యార్థి ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల వెల్కమ్ పార్టీలో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు ఎంతో వ్యయ ప్రయాసలతో కష్టపడి చదివిస్తున్నారని, వారి కష్టాన్ని వమ్ము చేయవద్దన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి మాట్లాడుతూ విద్యార్థి దశలో కష్టపడితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకొని మంచి జీవితాన్ని అనుభవించవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామిలను కళాశాల డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీరవల్లి సుజాత, కృష్ణవేణి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కావూరి రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినికి కళాశాల ఫీజు సాయం



బ్రహ్మేశ్వరికి రూ.15 వేలు అందిస్తున్న బీసీ సంఘాల నాయకులు

సత్తెనపల్లి: ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న చట్టు బ్రహ్మేశ్వరి కళాశాల ఫీజు రూ.15 వేలు బీసీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం అందించారు. సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామ బీసీ కాలనీలో నివసిస్తున్న చట్టు జనార్థన్ ఏడాది క్రితం మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో ఒక కుమార్తె ఇంటర్ చదువుకు అవసరమైన సాయాన్ని బీసీ సంఘాల ఆధ్వర్యంలో అందిస్తున్నారు. దీనిలో భాగంగా బ్రహ్మేశ్వరికి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫీజు రూ.15 వేలు గతంలో కుటుంబ సభ్యులకు అందించారు. ఈ ఏడాది కూడా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫీజును బీసీ సంఘాల నిర్ణయం మేరకు రూ.15 వేలు బుధవారం ప్రిన్సిపాల్‌కు అందించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు, కంటెపూడి సర్పంచ్ యమునా బొబ్బిలి, కంటు వెంకట్రామయ్య, గంప నరసింహారావు, కుమ్మరి దస్తగిరి, బత్తుల వెంకట స్వామి, పిక్కిలి శివ, శనగల బ్రహ్మం, బాదుగునల కమలాకర్, షేక్ చిన్న షరీఫ్, పులహరి బాజాజీ, గుంజి విజయ్, విప్పర్ల ఏడుకొండలు, చింకా అంకమ్మరావు, మోదుగుల బాబ్జి, ఎర్రగొర్ల శ్రీనివాస్, మల్లా వెంకటేశ్వర్లు, గొట్టం వెంకటేష్, గుంటూరు గోవింద్ ఉన్నారు.

దివ్యాంగులకు మండల లీగల్ ప్యానల్ అండ



మాట్లాడుతున్న మండల లీగల్‌సెల్ కమిటీ ప్యానల్ న్యాయవాది శరత్‌బాబు

నకరికల్లు: దివ్యాంగుల హక్కులను కాపాడేందుకు, వారికి అండగా ఉండేందుకు మండల లీగల్ సెల్ కమిటీ పనిచేస్తుందని ప్యానల్ న్యాయవాది వి.శరత్ బాబు అన్నారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, 13వ అదనపు జిల్లా జడ్జి ఆదేశాల మేరకు దివ్యాంగుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో స్థానిక భవిత కేంద్రంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయ సలహాల కోసం దివ్యాంగులు మండల లీగల్ కమిటీని సంప్రదించవచ్చన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా.. సదరన్ సర్టిఫికెట్‌లు పొందారా అని దివ్యాంగుల తల్లిదండ్రులను అడిగి వివరాలు సేకరించారు. వాటిని ఎలా పొందాలో వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎంఎల్ఎస్ ప్రసాద్, హెచ్ఎం కె.నగేష్, ఎం.స్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

ఎంపీడీవో బి.వెంకటరెడ్డి



బెల్లంకొండలో శిక్షణలో పాల్గొన్న సర్పంచ్‌లు, కార్యదర్శులతో ఎంపీడీవో

బెల్లంకొండ: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ఎప్పటికప్పుడు పంచాయతీ అధికారులు, సర్పంచ్‌లు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో బి.వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు మూడవ రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. ముందుగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ప్రణాళికలు రూపొందించుకుని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. పారిశుభ్రత, విద్యుత్ దీపాల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన వంటి వాటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలతో గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.